విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 01, మార్చి, 2024

మున్సిపల్ స్థలం అన్యాక్రాంతంపై రగడ

తాను మున్సిపాలిటీ నుండి ఒక్కరూపాయి లంచం తిన్నట్లు నిరూపిస్తే దేనికయినా సిద్ధం చైర్మన్ మాబున్నిసా

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణంలో సర్వే నెం 23 13/1లో విస్తీర్ణం 14.42 సెంట్లు మునిసిపాలిటీ కలిగి ఉంది. నంద్యాల మున్సిపల్ భూమి దాదాపుగా రూ.50 కోట్లు విలువ గల భూమి. దానిలో 2.40 సెంట్ల స్థలాన్ని 43 ప్లాట్లుగా విభజించి ప్రభుత్వ భూమిని బినామిలతో 8 మందికి రిజిస్టర్ చేసినారని దీని వెనక మున్సిపల్ అధికారులు, సబ్ రీజిస్ట్రార్ల పాత్ర ఉందని మున్సిపల్ కౌన్సిల్లో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారులపై ధ్వజమెత్తారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన గురువారం జరిగింది. అజెండా చదివిన వెంటనే దానికి ఆమోదం తెలిపిన తర్వాత మున్సిపల్ చైర్మన్ మాబునిసా మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలకు ఆమె వివరణ ఇచ్చారు. తాను మునిసిపల్ నిధులలో ఎటువంటి గోల్మాల్ చేయలేదని, తన నిజాయితీని శంకించాల్సిన అవసరం లేదని, తాను అవినీతికి పాల్పడి ఉంటే ఎంతదాకా అయినా సిద్ధంగా ఉన్నానని కౌన్సిల్ సాక్షిగా తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి ఫ్లోర్ లీడర్ మాబువలి మాట్లాడుతూ తన వద్ద అన్ని ఆధారాలు న్నాయని, 2022వ సంవత్సరంలో ఒక వ్యక్తి హైకోర్టు ఆర్డర్ తెచ్చుకొని, జీపి చేసుకుంటుంటే మున్సిపల్ అధికారులు నిద్రపోతున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు కోర్టుకు ఎందుకు నివేదించి అక్రమ రిజిస్టర్ లను ఆపలేకపోయారని ప్రశ్నించారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ శ్యాంసుందర్ లాల్ మాట్లాడుతూ అసలు హైకోర్టు ఆర్డర్ ఏముంది ? మున్సిపల్ అధికారులు హైకోర్టుకు ఎటువంటి నివేదికలు సమర్పించారో బహిర్గతం చేయాలని ప్రశ్నించారు. 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్,వైస్ చైర్మన్ పాంషావలి, టిడిపి ఫ్లోర్ లీడర్ మహబూబ్ వలి అధికారులను నిలదీస్తు చైర్ పర్సన్ మాబున్నిసాకు వివరించారు. దీనిపై చైర్ పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ మామీద బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, నేను ఎలాంటి అవినీతి చేయలేదన్నారు. ఎవరైన చేసీ ఉంటే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమృత్ పథకం ద్వారా నంద్యాల పట్టణంలో నీటి సమస్య రాకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్లు, కొ ఆప్షన్ సభ్యులు, అధికారులు ఎంఈఈ రమణమూర్తి, డీఈలు జయ భారత్ రెడ్డి, మదుకుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఓ వెంకట కృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. రెజ్వాన, శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభకు తరలిరండి

విశాలాంధ్ర-డోన్ : నియోజకవర్గ కేంద్రమైన డోన్‌లోని మధు ఫంక్షన్ హాల్ లో జరిగే సభను విజయవంతం చేయాలని టీడీపీ యువనేత కోట్ల రాఘవేంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కేసన్నగౌడ్, టీడీపీ నేత ఓబుళాపురం శేషరెడ్డిలు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక మధు ఫంక్షన్‌లో సభ స్థలాన్ని వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు.రాష్ట్రంలో వైసీపీ లనతో అభివృద్ధి అట్లడుగుస్థాయికి చేరుకుందన్నారు.రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన చరిత్ర జగన్మోహన్ రెడ్డికె దక్కిందన్నారు. డోన్ నియోజక వర్గంలో అభివృద్ధి మాటున ఎంతో అవినీతి జరిగిందని మండి పడ్డారు.అప్పుల మంత్రిని ఇంటికి పంపాలని నారా చంద్రబాబు నాయుడు అభ్యర్థి మార్పును చేశాడన్నారు. కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డిని ఎమ్మెల్యే అభివృద్ధిగా ప్రకటించడం జరిగిందన్నారు. దీంతో మొట్టమొదటిసారిగా డోన్ లో భారీ సభను నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ సభకు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ కె ఈ ప్రభాకర్ పాటు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, అదేవిధంగా నంద్యాల జిల్లా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు రానున్నారని తెలిపారు. కావున టీడీపీ, జనసేన నేతలు, నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, బాలకృష్ణ,పవన్ కళ్యాణ్ అభిమానులు అందరు హాజరై స్థానిక అమ్మ హెూటల్ నుంచి మధు ఫంక్షన్ వరకు జరిగే బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు.

4న ముఖ్యమంత్రి బనగానపల్లెకు రాక

విశాలాంధ్ర -బనగానపల్లె: ఈనెల 4వ తేదీన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బనగానపల్లె లో రూ.22 కోట్లతో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించడానికి వస్తున్నా నేపథ్యంలో హెలిప్యాడ్, సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి, డోన్ డీస్పీ శ్రీనివాస, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలోని స్థానిక శ్రీ చైతన్య పాఠశాల నందు జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విజ్ఞాన సదస్సు నమూనాల ప్రదర్శనలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా. తాజుద్దీన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యుత్ వలయ నమూనాలు సోలార్ ఎనర్జీ విల్ ఎనర్జీ బాణసంచా రసాయనాల ప్రదర్శన ట్రాఫిక్ అవేర్నెస్ జలసిద్ధి రసాయన శాస్త్ర ఫ్రేమ్స్ మొదలైన ఎన్నో విజ్ఞాన సంబంధ నమూనాలను విద్యార్థులు విభిన్న రీతిలో ప్రదర్శించి తమ జ్ఞానాన్ని చాటుకోవడం తో ప్రిన్సిపాల్ దీప ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పాఠశాల ఏజీఎం సురేష్ ఆర్ ఐ చౌదరి మాట్లాడుతూ మానవ జీవితంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రధానమని తెలియజేశారు . విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ విషయంలో ప్రావీణ్యం పొందటానికి తమ పాఠశాల కరికులం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు నేటి విజ్ఞాన పరిశోధన రేపటి తరానికి ఎంతగానో ఉపయోగపడుతుందని విజ్ఞాన శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని తమ ప్రతిభను చాటాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల కోఆర్డినేటర్ రమణ, ఉమామహేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ బోధన బోధనేతర బృందము పాల్గొన్నారు.

పని విద్యా ప్రదర్శన ప్రారంభించిన ఎంఈవో

విశాలాంధ్ర-అవుకు: పట్టణం లో ని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పని విద్యాప్రదర్శనను మండల విద్యాధికారి శ్రీధర్ రావు గురువారం ప్రారంభించారు. నేషనల్ టైలర్స్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన పని విద్యాప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన వస్తువులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. అద్భుత ప్రదర్శనను చేసిన విద్యార్థులను మరియు ఉపాధ్యాయురాలును అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి 2 వెంకటేశ్వర రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి, వృత్తి విద్య ఉపాధ్యాయురాలు విజయ కుమారి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకలి బాధను అరికడదాం

చేయి చేయి కలుపుదాం ముందుకు నడిపిద్దాం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : జాయ్ పీస్ ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు మెతుకులే కదా, బయట పాడేద్దామని మనం అనుకుంటాం. కానీ, ఆనాలుగు మెతుకులు దొరక్క ఆకలితో నరకయాతన అనుభవిస్తున్ననిరుపేదలు ఈ దేశంలో ఎంతోమంది ఉన్నారు. వారి ఆకలి బాధను అర్థం చేసుకున్న ఓ యువ బృందం ఆలోచనల నుంచి పుట్టిందే ఈజాయ్ పీస్ ఫ్రెండ్స్ సొసైటీ. ఈ సంస్థ పేదల కడుపు నింపడానికి నిరంతరం కృషి చేస్తుంది. ఈసొసైటీ ద్వారా గురువారం రోడ్డు వెంట ఉన్న అనాధలకు నిరాశ్రయులైన వారికి భోజనాలు మరియు పళ్ళ మజ్జిగ అందజేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ సభ్యులు బి.రాహుల్, సురేష్, కమల్, చైతన్య, పవన్, రాజేష్, పృధ్వీ, కిరణ, మాధవ్, ఉపేంద్ర, ఉదయ్ భాస్కర్, మస్తాన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ మృతికి ఎమ్మెల్యే సంతాపం

విశాలాంధ్ర-చాగలమర్రి: మండలంలోని డి.కొత్తపల్లెకు చెందిన వాలంటీర్ ఏరువ రమేష్ రెడ్డి(35) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకొని వాలంటీర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, ఎంపిపి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,వైసీపీ నాయకులు ఎంపిటిసి పత్తినారాయణ, శేషరమేష్, రహమాన్, చిన్నారెడ్డి, ఓబులపతి, ప్రతాప్ తదితరులు ఉన్నారు.

రేవనూరులో అవగాహన సదస్సు - సీఐ జయచంద్ర

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్ల పరిధిలోని రేవనూరు గ్రామాల్లో గురువారం సీఐ జయచంద్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామాల్లో వర్గ విభేదాలు, రాజకీయ కక్షలు లేకుండా ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలాగాలన్నారు. చిన్న చిన్న సమస్యలను పెంచుకొని కక్షలుపెట్టుకొని గొడవలకు పాల్పడకూడదని పేర్కొన్నారు.గ్రామాల్లో ప్రజలందరూ సమానంగా కలిసి మెలసి జీవించాలని సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు.అంతేకాకుండా గ్రామాల్లో బెల్ట్ షాపులు, నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐతో పాటు రేవనూరు ఎస్సై రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ మహోత్సవం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల కేంద్రమైన కోవెలకుంట్లలో గురువారం శ్రీ పాండురంగ విఠలేశ్వర దేవాలయ ఆవరణంలో ఘనంగా ధ్వజస్తంభ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 27,28 రెండు రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మూడోరోజు ధ్వజస్తంభ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందించి తర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ కానాల రవీంద్రనాథ్ రెడ్డి,ఆలయ ధర్మకర్త రాంభూపాల్ రెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-నంద్యాల రూరల్ : పరమపవిత్రమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ కార్యాలయం నందు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే కాలినడకన వచ్చే భక్తులకు అక్కడక్కడ తాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్ కుమార్,మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, స్పెషల్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, శ్రీశైలం దేవస్థానం సిబ్బంది, ఆయా సాధనకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాబు సూపర్ సిక్స్ పథకాల ప్రచారం ప్రతిగడపకు చేరాలి- మాజీ ఎమ్మెల్యే బుడ్డా

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్ : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్-6లో పొందుపరిచిన హామీలను ప్రతి గడపకు వెళ్లి తెలియజేయాలని టిడిపి శ్రీశైలం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సూచించారు. సూపర్-6 అనేది పేద, మధ్యతరగ ప్రజల మేనిఫెస్టో అన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని ఎం.ఎం గార్డెన్ నందు శ్రీశైల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ ఛార్జిలతో బుడ్డా రాజశేఖర రెడ్డి సమావేశ మయ్యారు. తెలుగుదేశం పార్టీ - జనసేన పార్టీలు ఉమ్మడిగా రూపొందించిన బాబు సూపర్ సిక్స్ లోని పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని క్యాడర్ కు సూచించారు. మహాశక్తి పథకంలోని తల్లికి వందనం పథకం క్రింద ఏడాదికి ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికీ రూ.15వేలు ఆర్థిక సహాయం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండరర్లు, మహిళలకు జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి క్రింద నెలనెల రూ.15 వేల ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి తాగు నీటి సరఫరా, అలాగే అన్నదాత పథకం క్రింద ప్రతి రైతుకి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం, యువగలం పథకం కింద రూ.20 లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగులకు నెలనెలా రూ.3 వేల ఆర్థిక సహాయం, బీసీలకు రక్షణ చట్టం, పేదలను సంపన్నులను చేసేందుకు పూర్ టూ రిచ్ పథకం లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని క్యాడర్ కు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు.టిడిపి అధికారంలోకి వస్తే పథకాలు రద్దు చేస్తారని వైసిపి చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా అన్నారు. సంక్షేమ పథకాలను దేశంలో మొట్టమొదటగా ప్రవేశ పెట్టిన పార్టీ తెలుగుదేశమే నని వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మనం రానున్న ఎన్నికల్లో రాక్షసులతో పోరాటం చేస్తున్నాం కాబట్టి సంసిద్ధంగా, పట్టుదలతో కసిగా పని టిడిపి విజయానికి పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, సీనియర్ నాయకుడు కంచర్ల గోవింద రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేణు గోపాల్, మండల అధ్యక్షులు అన్నారపు శేష రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, బెంజ్మెన్, నరసింహా రెడ్డి, ఉల్లి మధు, క్లస్టర్ ఇన్చార్జిలు మల్లేశ్వర రెడ్డి, మల్లికార్జున రెడ్డి, కలాం తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకోస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్

ఇష్టారాజ్యంగా అనుమతులిస్తున్న అధికారులు

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి.నాగరాముడు

విశాలాంధ్ర - నంద్యాల: పుట్టగొడుగుల్లా ప్రైవేట్ హాస్పిటల్స్ పుట్టుకోస్తున్నాయని, ఇష్టారాజ్యంగా అధికారులు ఎలా అనుమతులిస్తున్నారని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి జి.నాగరాముడు ప్రశ్నించారు. వైద్యం నిల్-పైసా వసూల్ ఫుల్ అన్న రితిగా రోగుల రక్తాన్ని జలగల్ల పీల్చుకొని తాగుతున్న ప్రైవేట్ హాస్పిటల్ పై చర్యలు తీసుకోని అధికారుల వైనాన్ని ఆయన నిలదీశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక నంద్యాల సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమా వేశం లో జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రమయిన తర్వాత ప్రైవేట్ హాస్పిటల్ పూటకు ఒకటి రోజుకొకటి పుట్టగొడుగుల్లా పుట్టుకోస్తున్నాయని ఆరోపించారు. అయితే వైద్యాశాఖ అధికారులు కూడా ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకున్నా ఇష్టమొచ్చినట్టు అనుమతులు ఇస్తున్నారని వారన్నారు. కావున అధికారులు నిద్ర మత్తు, మామూళ్ళ మత్తు వదిలి పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చి, విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యలపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ నంద్యాల పట్టణ కార్యదర్శి విష్ణు, నాయకులు ఎర్రిస్వామి, చరన్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

2న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - నంద్యాల: స్థానిక బొమ్మలసత్రం సమీపంలోని పీఎస్సీ అండ్ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 2వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వ హిస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. శశికళ ఆధ్వర్యంలో జాబ్ మేళాకు సంబంధించిన బ్రోచర్ ను ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. నిరుద్యోగ విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో 20కి పైగా మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా కంపెనీలకు సంబంధించిన ఉద్యోగాలకు అవసరమైన విద్యార్హతలను కలిగిన విద్యార్థులు వారి రెజ్యూమ్ లను సిద్ధం చేసుకోవాలని, ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకొని జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆయా కంపెనీలలో దాదాపుగా 500కు పైగా ఉద్యోగాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఒక్కొక్క కంపెనీకి సంబందించి విద్యార్థులు రెజ్యూమ్ లను వేర్వేరుగా సమర్పించవలసి ఉందన్నారు. ఈ జాబ్ మేళాలో నంద్యాల జిల్లా పరిదిలోని 9 ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొననున్నారన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

విశాలాంధ్ర-అవుకు: నిండు జీవితానికి రెండు చుక్కలు చాలని అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డా.నవీన్ కుమార్ అధ్యక్షతన టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల3న ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డా.వినోద్ కుమార్ మాట్లాడుతూ 0-5 ఏళ్ల పిల్లలందరికీ రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ వేయించి పోలియో వ్యాధి రాకుండా కాపాడుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 37 పోలియో బూతులు, ట్రాన్సిస్టర్-2, ఒక మొబైల్ టీమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో 4200 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 3వ తేదీ పోలియో చుక్కలు వేయించుకొని పిల్లల కోసం సోమ,మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించి పిల్లలకు పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆటోగ్యారేజ్‌లో అగ్నిప్రమాదం..

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాలలోని పొగాకు కంపెనీ సమీపంలోని ఓపాత ఇనుప సామాన్ల షాపులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.ట్రాక్టర్, డోజర్, హార్వెస్టర్ లు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. షాట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి భారీగా మంటలు చెలరేగాయి. దాదాపు పది లక్షల నష్టం వాటిల్లిందని గ్యారేజ్ యాజమాన్యం వాపోయారు.

అహోబిలం చేరుకున్న పారువేట ఉత్సవమూర్తులు

▶ అహోబిలేశ్వరులకు పూర్ణకుంభ స్వాగతం ▶ ఉత్సవ మూర్తులకు లఘు సంప్రోక్షణ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి పారువేట ఉత్సవ పల్లకి గురువారం తెల్లవారు జామున రుద్రవరం గ్రామం నుంచి అహోబిల క్షేత్రం చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం ప్రహ్లాద వరద స్వామి, జ్వాల నరసింహ స్వామిలకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అహోబిలం చేరుకున్న ఉత్సవ పల్లకికి ఎలక్ట్రికల్ ఏడిఇ రవికాంత్‌చౌదరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఉత్సవ పల్లకి బోయిలకు, భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఊరేగింపుగా అహోబిల క్షేత్రం చేరుకున్న అహోబిలేశ్వరులకు ప్రధాన అర్చకులు, అర్చక బృందం లఘు సంప్రోక్షణ నిర్వహించి ఆలయ ప్రాంగణంలో సుదర్శన హెూమం నిర్వహించారు. అహోబిలేశ్వరులను కొలువుదీరిన ఉత్సవ పల్లకి జనవరి 16న సంక్రాంతి కనుమ నాడు ప్రారంభమైన పారువేట ఉత్సవాలు ఫిబ్రవరి 29వ తేదీ గురువారంతో ముగిశాయి. ఉత్సవపల్లకి 3 మండలాల్లో 45 రోజుల పాటు 33 గ్రామాల్లో పర్యటించి మార్చి మాసంలో జరిగే తమకళ్యాణ ఉత్సవాలకు స్వయంగా భక్తులను ఆహ్వానించేందుకుఆయాగ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన తెలుపులపై ఆసీనులై భక్తుల నుండి పూజలు అందుకున్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా 45 రోజులపాటు ఈ అహోబిల క్షేత్రంలో మాత్రమే పారువేట ఉత్సవాలు కొనసాగుతాయి. 150 ఏళ్లకు పైగా పారువేట ఉత్సవాలు ఈ క్షేత్రంలో జరుగుతున్నాయని ప్రధానార్చకులు తెలిపారు. పారు వేట ఉత్సవమూర్తులు అహోబిలం చేరు కోవడంతో లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈకార్యక్రమంలో జీపీఏ సంపత్, ఓఎస్డీ శివ ప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతు రామన్ తదితరులు పాల్గొన్నారు.

3న బేతంచెర్లకు కృష్ణా జలాలు -చైర్మన్ చలంరెడ్డి

విశాలాంధ్ర-బేతంచెర్ల : ఈనెల 3వ తేదీ (ఆదివారం) గోరుకల్లు రిజర్వాయర్ నుండి శుద్ధ జలాలైన కృష్ణానీళ్ల ను బేతంచెర్ల పట్టణానికి తీసుకురాబోతున్నామని, అదే రోజున గంగమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పట్టణ ప్రజలకు నీటి సమస్య తీరుస్తామని నగర పంచాయతీ చైర్మన్ చైర్మన్ చలం రెడ్డి గురువారం కమిషనర్ రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి నివారణకు ఆర్థిక మంత్రి చొరవతో రూ.351లతో గోరు కల్లు రిజర్వాయర్ నుండి నీటిని తీసుకొచ్చి దాహం తీర్చబోతున్నామన్నారు. మండల ప్రజలు ఆర్థిక మంత్రి చేసిన మేలుకు కృతజ్ఞత చూపాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు చింతా నాగిరెడ్డి, ఇబ్రహీం,మధు, ఉసేన్ బి,పర్వీన్, అంజి, రామ గోపాల్,కో ఆప్షన్ సభ్యులు సునీల్, ఎల్లయ్య, అబిద, అధికారులు శేఖర్, అంజద్ బాషా, శ్రీదేవి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి భరోసా

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడుమండలం గుంతకందాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆనంద్ కుటుంబానికి శిల్పా తనయుడు కార్తీక్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ భరోసా ఇస్తామని చెప్పడం జరిగింది. అందులో భాగంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతుల మీదగా గురువారం రూ. 15 వేలు అందించారు. గుంతకందాలకు చెందిన టీడీపీకి చెందిన 70 కుటుంబాలు చాంద్‌బాష, గౌస్‌మోహిద్దీన్, అబ్బాస్‌మియా, పెద్ద బాలుడు, శివ రాజారావు ఆధ్వర్యంలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమేష్, అం బాల, షంషీర్, తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిగా వెలుగొందుతున్న ఉద్యమనేత గాడిచర్ల

విశాలాంధ్ర - వెలుగోడు : చిరంజీవిగా వెలుగొందుతున్న వందేమాతరం ఉద్యమనేత, గ్రంథాలయ పితామహుడు, స్వాతంత్ర్యసమర యోధుడు, వయోజన విద్య స్థాపకుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నంద్యాల నుంచి 1928లో మొట్ట మొదటి ఎమ్మెల్యేగా గెలిచి, నంద్యాల ప్రాంతానికి ఎనలేని కృషి చేసిన మాహాను బావులు గాడిచర్ల హరి సర్వోత్తమరావు 64వ వర్ధంతిని శాఖా గ్రంథాలయం వెలుగోడులో ఏర్పాటుచేసిన నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. లిటిల్ ఏంజిల్స్ స్కూల్ విద్యార్థులు పాఠశాల నుంచి ర్యాలీ గా గ్రంథాలయం చేరుకుని కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఎఫ్ ఇమ్మానియేల్, గ్రంథాలయ అధికారి సుమలత చిత్రపటానికి, విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పుస్తక పఠనం గావించారు. జాతీయ బి.సి.సంక్షేమ సంఘము రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘు రాముడు యాదవ్, ఎస్డీపిఐ నాయకులు హుస్సేన్ బాషా , తోసిఫ్ కూడా నివాళులు అర్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయిపల్లి గ్రామంలో రాంకో సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.శిబిరానికి విచ్చేసిన రోగులకు రాంకో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. 136 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వ్యాధులబారిన పడకుండా ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండి వాటిపై అవగాహన కలిగిఉండాలని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసర పరిశుభ్రతను పాటించాలన్నారు. రాబోవు వేసవి దృష్ట్యా ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. రాంకో సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో పై అవగాహన సదస్సు



విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు మండలంలోని ఎంపీడీవో ఆఫీస్ నందు ఈనెల 3 వ తేదీ జరగబోయే పల్స్ పోలియో పట్ల అవగాహన కల్పించినయుపిహెచ్సి మెడికల్ ఆఫీసర్ డా.సాజిదా, పిహెచ్సి డాక్టర్ విజ యేంద్ర ఆధ్వర్యంలో పల్స్ పోలియో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగడివాడీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బొలెరో వాహనం దగ్ధం- తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : షాక్ సర్క్యూట్తో లగేజ్‌ని తీసుకువెళ్లే బొలెరో పికప్ వాహనం దగ్ధమైన ఘటన మండల సరిహద్దుల్లోని మీర్జాపురం రామిరెడ్డిపల్లి గ్రామాల మధ్యలో గురువారం చోటు చేసుకుంది.వివరాల మేరకు మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన బొలెరో వాహన యజమాని కృష్ణమోహన్ ఎండు మిర్చి లోడు కోసం గ్రామ సరిహద్దులలోని సంజామల మండలం రామిరెడ్డిపల్లి గ్రామ పొలాల్లోకి వాహనాన్ని తీసుకోని వెళ్ళాడు. రైతు పొలం వద్ద ఎండుమిర్చి సంచుల్లో నింపుకొని లోడ్ చేసుకోవడానికి సిద్ధమయ్యారు. మిట్ట మధ్యాహ్నం కావడంతో ఎండల వేడికి వాహనములో సర్క్యూట్తో కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో వాహనం ముందు భాగంలోని డ్రైవర్‌సీట్ తో పాటు ముందు టైర్లు, ఇంజన్, ఇతర భాగాలు క్షణాల్లో కాలి దెబ్బతిన్నాయి. వాహనంలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దాదాపు మూడు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత యజమాని కృష్ణమోహన్ తెలిపారు. సంజామల పోలీసులకు సమాచారం అందించినట్టు బాధితుడు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 01, మార్చి, 2024

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలంటూ..ఎస్సీడీడీ ఖాళీ కుర్చీకి వినతి

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : విద్యార్థినిల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎస్సి హాస్టల్ వార్డెన్ శిరీషపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి జి.మునిస్వామి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నగరసమితి ఆధ్వర్యంలో గురువారం సంక్షేమం భవన్‌లో ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగ లక్ష్మి దేవి ఖాళీకుర్చీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి జి.మునిస్వామి,నగర కోశాధికారి సి.అశోక్‌లు మాట్లాడుతూ కర్నూలు నగర పరిధిలోని బి.క్యాంపులోనిఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినిలను డబ్బులు చెల్లిస్తేనే హాస్టల్ లో ఉండాలని లేకపోతే బయటకు పంపుతానని విద్యార్థినీలను అసభ్యకర పద జాలంతో భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. విద్యార్థినిలకు గోశాలలకు వెళ్లేటువంటి పాడైనటువంటి కూరగాయలను తీసుకొచ్చి విద్యార్థినిలకు ఆహారంగా ఇస్తున్నారని ఆరోపించారు. ఈవిషయాలన్నీ బయటికి వెళ్లకుండా డిగ్రీ విద్యార్థినిల మొబైల్స్ ని వార్డెన్ దగ్గరే ఉంచుకున్నారని అదేవిధంగా హాస్టల్ సమస్యలు బయటికి తెలియజేస్తే హాస్టల్ నుండి బయటకు పంపిస్తానని విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తుందని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి వార్డెన్ శిరీషపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో హాస్టల్ విద్యార్థినీలను కలుపుకొని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు బి.హరి బి.శివరాజ్ ఆర్. రాజశేఖర్ ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధి రూ.450 కోట్లు జమ చేయాలి-ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణకార్మికులు జగన్మోహన్ రెడ్డి వాడుకున్నటువంటి రూ 450 కోట్లు నిధులను సంక్షేమ బోర్డుకి తిరిగి జమ చేయాలని ,బోర్డు నిర్వీర్యం చేసి కార్మికులు సంక్షేమ పథకాలు తుట్లు పొడిచిన జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో కార్మికులు తగిన గుణపాఠం చెప్తారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప హెచ్చరించారు. గురువారం కర్నూల్ కలెక్టరేట్ ముందు నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి నల్లన్న అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, నగర కార్యదర్శి జి చంద్రశేఖర్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డీసీ రెహమాన్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి మునెప్ప మాట్లాడుతూ జీవో నెంబర్ 17 ద్వారా కార్మికులకు ద్రోహం చేశారన్నారు. రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్నటువంటి 450 కోట్లు రూపాయలు సంక్షేమ బోర్డుకి జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .అన్ని రకాల క్లెయిమ్స్ ని వెంటనే విడుదల చేయాలి దశాబ్దాల తరబడి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 దేశవ్యాప్తంగా అమలవుతున్నా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బోర్డును నిర్వీర్యం చేశారని వారు తెలిపారు. కార్మికుల నుంచి సంక్షేమ బోర్డులో సభ్యత్వం పేరుతో, భవన నిర్మాణ యజమానుల నుంచి సెస్ పేరుతో వసూలు చేస్తున్న వేల కోట్ల నిధులను జీవో నంబర్ 17 ద్వారా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు, ఇతర ప్రయోజనాలకు మళ్లించుకుంటున్న జగన్ ప్రభుత్వం కష్టజీవుల పక్షపాతినని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు బి వెంకటేష్ డిప్యూటీ కార్యదర్శి టి రామాంజనేయులు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ గారు కార్యదర్శులు . కృష్ణారెడ్డి జయరాం రెడ్డి భవన నిర్మాణ కార్మికులు జిల్లా రేణుక కృష్ణ.ధరన్న నాగరాజు శ్రీను మధు.తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తాం

విశాలాంధ్ర-హెరాళగుండ : ఆలూరు గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ డిఎస్‌భాష పేర్కొన్నారు. విజయవాడలోని ఏపీ కాంగ్రెస్ పార్టీ కమిటీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా డి.ఎస్.భాష మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేశానని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ప్రజా వ్యతిరేక పాలనకు నిరసన చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే అందరి సహకారంతో విజయం సాధిస్తానన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఎంపీటీసీగా,సర్పంచ్‌గా ఎన్నికైప్రజా సేవలు చేశానని ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తానన్నారు. నియోజకవర్గం ఓబీసీ సెల్ అధ్యక్షుడు సి మంగయ్య, సీనియర్ నాయకుడు పాల్గొన్నారు.

సీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కర్నూలు : నగరంలోని గీతాముఖర్జీ నగర్‌లో సీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

శుక్రవారం ఈ వైద్య శిబిరానికి కాలనీ ప్రజలు 100 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సిఆర్ సేవా సమితి అధ్యక్షులు కే.జగన్నాథం మాట్లాడుతూ కంటికి సంబంధించిన వ్యాధులతో చాలా రోజుల నుంచి బాధలు పడుతున్న పేదలకు సిఆర్ సేవా సమితి- శాంతిరాం ఐ హాస్పిటల్ గాయత్రీ ఎస్టేట్ వారిచే ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు, కంటీఅద్దాలు తక్కువ ధరకే ఇప్పిస్తామన్నారు. పేదలకు వైద్యం ఖరీదైన తరుణంలో ఇళ్ల దగ్గరే ఉండి ఎంతో ఇబ్బందులు పడుతున్న ముసలివారికి ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని భవిష్యత్తులో కూడా ఇతర నిపుణులను తీసుకువచ్చి వైద్య శిబిరాలు సిఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. గీతా ముఖర్జీ నగర్ లో ప్రజలను సమీకరించి వైద్య శిబిరానికి అన్ని విధాల సహకరించిన నాగరాజు,రామచంద్ర,ఆసియా బేగం తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిఆర్ సేవా సమితి కార్యవర్గ సభ్యులు శివప్రసాద్ ,శాంతిరాం ఐ హాస్పిటల్ సిబ్బంది వెంకట సాయి ,సురేష్ ,మధు ,సాయి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర-ఆస్పరి : మండల కేంద్రంలోనే మేజర్ గ్రామపంచాయతీలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని సర్పంచ్ మూలింటి రాధమ్మ తెలిపారు. గురువారం స్థానిక సచి వాలయ కేంద్రం-1 లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచు మూలింటి రాధమ్మ మండల ఈవోఆర్డి సూర్య నరసింహారెడ్డిలు మాట్లాడుతూ ఈ ఏడాది సరైన వర్షాలు లేని కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోయి మండలంలోని అన్ని గ్రామాలలో కూడా నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. మరి ముఖ్యంగా మేజర్ పంచాయతీలో నీటి సమస్య పరిష్కారానికి పంచాయతీ పరిధిలో ఉన్న చేతిపంపు బోర్లలో అదనంగా పైపులు దింపి రీసైక్లింగ్ చేసి 1.5 హెచ్ బి మోటార్ తో నీటి సరఫరా చేస్తామన్నారు. నాగనాథ హళ్లి వాటర్ స్కీం నుండి ఆస్పరికి రావాల్సిన త్రాగునీరు సక్రమంగా రావడం లేదని, అక్కడక్కడ పంట పొలాల్లో వాటర్ స్కీం పైపులైను లీకేజీలు గుర్తించామని, లీకేజీలు ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు.మేజర్ పంచాయితీలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య నెలకొన్న వార్డులలో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఆస్పరి ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా కేడీసీసీ డైరెక్టర్ రాఘవేంద్ర, పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఉప సర్పంచ్ సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం కలిగి ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - చిప్పగిరి : సమాజంలో దయాసేవా గుణం కలిగి ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆలూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త విరుపాక్షి అన్నారు. గురువారం మండల కేంద్రమైన చిప్పగిరిలోని ఆలూరు వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి స్వగృహంలో హెాలగుంద మండల పరిధిలోని కోగిల తోట గ్రామానికి చెందిన శివ స్వాములు విరుపాక్షిని కలిసి మార్చి మాసం 3,4వ తేదీలలో శివ స్వాముల ఆధ్వర్యంలో జరిగే సామూహిక వివాహాలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందుకు స్పందించిన వీరుపాక్షి తప్పక హాజరు అవుతానంటూ సామూహిక వివాహాల కొరకు రూ. 50 వేలు తన వంతు విరాళంగా శివ స్వాములకు అందజేశారు. ఇందుకు హర్షించిన శివ స్వాములు విరుపాక్షిని పూలమాలు శాలవాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ స్వాముల ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు చేపట్టడం ఎంతో సంతోషించదగ్గ విషయమని నిరుపేద కుటుంబాలకు కాస్త చేయూతనిచ్చిన వారం అవుతామన్నారు.

టీడీపీలో కొలిక్కిరాని సీట్ల వ్యవహారం -ఆందోళనలో నేతలు, కార్యకర్తలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లాలో టీడీపీలో సీట్ల వ్యవహారం ఇంకా కొలిక్కి రాకపోవడంతో నేతలు, కార్యకర్తలు ఆందోళనలో ఉన్నారు. కొంత మంది నాయకులు అదిష్టానంపై ఆగ్రహంతో ఉండగా, మరి కొందరు తమ నేతకు సీటు ఇవ్వకపోతే ముక్కుమ్మడిగా రాజీనామాలు చేస్తామని అదిష్టానంను హెచ్చరిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో అదిష్టానం ఇప్పటి వరకు మొదటి విడత కర్నూలు, పత్తికొండ, కోడుమూరు సీటను ప్రకటించింది. ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలలో అభ్యర్థులను పెండింగ్‌లో పెట్టింది.ఆదోని నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థులు పోటీ పడుతుండ టంతో అదిష్టానం ఎవరికి సీటు ఇవ్వాలనే విషయంలో సర్వేలు నిర్వహిస్తుంది. ఎమ్మిగనూరు సీటు విషయంలో ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డికి ,డాక్టర్ మాచాని సోమనాథ్‌ల మధ్య పోటీ ఉంది. అదిష్టానం బీవీ జయనాగేశ్వరరెడ్డి వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తుంది. ఆలూరు ఇన్‌చార్జిగా కోట్ల సుజాతమ్మ ఉన్నారు. సుజాతమ్మ భర్త కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డికి డోన్ సీటు కేటాయించడంతో కుటుంబానికి ఒక్కసీటు అన్న నినాదంలో సుజాతమ్మకు సీటు ఇస్తారా లేదా అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. సుజాతమ్మతోపాటు వైకుంఠం కుటుంబంతోపాటు వీరభద్రగౌడ్ , బళ్ళారికి మేయర్ శశికళ పోటీ పడుతున్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను వైసీపీ అదిష్టానం ఎంపీగా పోటీ చేయాలని ఆదేశించడంతో ఆయన తనకు ఆలూరు సీటు ఇవ్వాలని పట్టుపట్టి పార్టీకి దూరంగా ఉన్నారు. గుమ్మనురు జయరాం టీడీపీలో చేరతారనే ప్రచారం ఉంది. అయితే జయరాంకు గుంటకల్లు, లేదా ఆలూరు సీటు ఇస్తారే ప్రచారం ఉంది. మరో రెండురోజుల్లో ఈవిషయం అదిష్టానం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌చార్జిగా తిక్కారెడ్డి కొనసాగుతున్నారు. ఇక్కడ నుండి బీసీ ఇవ్వాలని అదిష్టానం ఆశిస్తే మాత్రం మాధవరం చెందిన రాఘవేంద్రరెడ్డి లేదా ఉలిగయ్యకు అవకాశం ఉంది. అయితే తిక్కారెడ్డికే సీటు ఇవ్వాలని నియోజకవర్గంలో పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తలు, నాయకులు అదిష్టానంపై వత్తిడి తీసుకువస్తున్నారు. తిక్కారెడ్డికి సీటు ఇవ్వకపోతే ముక్కుమ్మడి రాజీనామా చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అదిష్టానం కొద్ది రోజుల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. పెండింగ్‌లో ఉన్న సీట్ల విషయంలో అటు నేతలు, ఇటు నాయకులు, కార్యకర్తలు గందరగోళంలో ఉన్నారు.

కార్మికునికి అందని మెరుగైన వైద్యం అందించాలి

- విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యుదాఘాతానికి గురైన కార్మికుడు
- తూతూ మంత్రంగా ఏఈకి మెమో జారీ చేసిన ఉన్నతాధికారులు
- సస్పెండ్ అయిన లైన్మెన్ను తిరిగి నాలుగు రోజులకే విధుల్లోకి తీసుకున్న వైనం...
- మండిపడుతున్న కార్మికుడి కుటుంబ సభ్యులు, సీపీఐ ఏఐటీయూసీ సంఘాల నాయకులు
- ఆలూరు ఏడీఈ కార్యాలయాన్ని ముట్టడించిన గ్రామస్తులు
- ఏడీతో వాగ్వానానికి దిగిన ఏఐటీయూసీ సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-ఆలూరు: ఆలూరు: ఈనెల 17వ తేదీన ఆలూరు మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో విద్యుత్ కొత్త లైన్ పనులను లైన్మెన్ చంద్రశేఖర్ సమక్షంలో చేపడుతున్నారు. హత్తిబెళగల్ గ్రామానికి చెందిన కార్మికుడు దివాకర్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తూతూ మంత్రంగా విచారణ చేపట్టి లైన్మెన్ సస్పెండ్ చేసి, ఏఈ లోకేష్కు మెమో జారీ చేశారు. కానీ సస్పెండ్ అయిన లైన్మెన్ చంద్రశేఖర్ను ఈనెల 22వ తేదీన సస్పెండ్ చేశారు. ఈనెల 26వ తేదీన తిరిగి విధుల్లోకి తీసుకున్నారు.అలాగే ప్రమాదానికి గురైన కార్మికుడికి మెరుగైన వైద్యం అందించలేదు. ఎలాంటి నష్టపరిహారం కూడా అందించలేదు. దీంతో కార్మికుడి తరపున కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు విద్యుత్ శాఖ తీరుపై మండి పడుతున్నారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ నాయకులు భూపేష్, గోపాల్, ఎస్.ఎన్. బాషా, హత్తిబెళగల్ గ్రామ సర్పంచ్ మౌలాల్, మాజీ ఎంపీటీసీ షేక్షావలి, తులసీరామ్, శివప్ప, వులి, దేవేంద్ర బాధితా కార్మికుడు దివాకర్ను కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆలూరులోని ఏడీఈ కార్యాలయాన్ని ముట్టడించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల విద్యుత్షాకు గురైన దివాకర్‌కు విద్యుత్‌శాఖ మెరుగైన వైద్యం అందించి, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల అలసత్వంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. వారి ప్రాణాలకు భరోసా ఏదీ అని విద్యుత్ శాఖను ప్రశ్నించారు. బాధితా కార్మికుడికి నష్టపరిహారం, మెరుగైన వైద్యం అందించేందుకు పోరాడతామని చెప్పారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు.. స్వీపర్లతో గొడ్డుచాకిరి చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

విశాలాంధ్ర-ఆలూరు: మండలం మొలగవల్లి జడ్పిహెచ్ఎస్ స్కూలులో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులతో నా, స్వీపర్లతోనా గత కొన్ని రోజుల నుంచి గోడ్డు చాకిరి చేయిస్తున్నారని విద్యార్థులు, తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు ఈ విషయాన్ని బయట ఎవరికైనా చెబితే, మీకు టీసీ ఇచ్చి ఇంటికి పంపిస్తామని భయపెట్టిస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపణ బయటి వ్యక్తులతో మగ వాళ్ళతో చేయించాల్సిన పనులను కూడా ఇలా లేడీ స్వీపర్లతో ఇలా గుంతలు తీయించడం, కాలువలు తీయించడం ఎంతవరకు సబబని అటుగా వెళ్తున్న వారు గుసగుసలాడు తున్నారు హెడ్మాస్టర్ చెప్పిన పని చేయకపోతే ఇంటికి వెళ్లిపోండని లేక మీకు ఈ నెల జీతం కట్ చేస్తానని బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని స్వీపర్లు మనసులోనే ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సన్నిహితులు ద్వారా సమాచారం వీరు బయటకు చెప్పలేక మనసులోనే కుమిలిపోతున్నారని అలాగే నాడు నేడు కింద పనులలో చాలా అవకతవకలు జరిగాయిని ఒకేసారి టన్నులకొద్ది ఐరన్ స్టీల్ తేవడం వల్ల తూప్పు పట్టి దేనికి పనికి రాకుండా అవుతు%శీ%దని ఇలా నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజల సొమ్ముకు బాధ్యత వహించాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడం ఎంతవరకు సమంజసమని తక్షణమే ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని అలాగే స్కూలు కాంపౌండ్ చుట్టూ ముళ్లపొదలు, కంపచెట్లు విషపురుగులకు అడ్డాగా మారిందని భయం భయంగా స్కూల్ కి వెళ్తున్న విద్యార్థులు ఎన్నిసార్లు స్కూల్ హెచ్ఎంకు సిబ్బందికి చెప్పిన పట్టించుకోని వైనం ఈ ముళ్ళపొదలు, చెట్ల పొదలను తొలగించి విషపురుగుల భారి నుండి మా పిల్లలను కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కోరడం జరిగింది.

వైసీపీలోకి సీనియర్ ఐఏఎస్ అధికారి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : సీనియర్ ఐఏఎస్ అధికారి ఏ.ఎండి ఇంతియాజ్ వైఎ స్ఆర్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. గురువారం సీ ఎం.క్యాంప్ కా ర్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఏ.ఎండి ఇంతి యాజ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఇంతియాజ్, సెర్ప్ సీఈవోగా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్య దర్శిగా ఇంతియాజ్ బాధ్యతలు నిర్వహించారు.ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు అప్లై చేసుకోగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.వచ్చే ఎన్నికల్లో కర్నూలు అభ్యర్థిగా ఇంతియాజ్ బరిలోకి దిగనున్నారని తెలు స్తోంది. కార్యక్రమంలో వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, కర్నూలు మేయర్ బి.వై.రామయ్య, మా జీ ఎమ్మెల్యే ఎస్.వి మోహన్ రెడ్డిలు పాల్గొన్నారు.

తాడేపల్లికి చేరిన కర్నూలు పంచాయతీ కర్నూలు సీటు మైనారిటీలకు ఇవ్వాలని అదిష్టానం తమకే ఇవ్వాలంటున్న ఎస్వీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు సీట్ల పంచాయతీ చివరకు తాడేపల్లికి చేరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, సమన్వయకర్తలు కర్నూలు మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తోపాటు పలువురు నేతలు తాడేపల్లికి బయలు దేరి వెళ్లారు. కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు సీటు ఇచ్చే విషయం లో అదిష్టానం అయిష్టంగా ఉంది.హాఫీజ్‌ఖాన్‌కు సీటు ఇవ్వాలని పార్టీ సమన్వయ కర్తల ముందు ఆందోళనకు దిగారు. అయితే అదిష్టానం హాఫీజ్ ఖాన్‌కు కాకుండా మరో మైనారిటీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గత మూడు రోజులు క్రితం డాక్టర్ ఇలియాజ్ బాషను అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది. అయితే అనూహ్యంగా కర్నూలు జిల్లాకు చెందిన ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్‌ను బుధవారం తన పదవికి రాజీనామ చేయడం, గురువారం ఆయన జగన్ సమక్షంలో వైసీపీలో చేరడం జరిగింది. దీంతో ఆయన మొదట కర్నూలు ఎంపీగా పోటీ చేస్తారని ప్రచారం జరిగినా చివరకు ఆయన కర్నూలు శాసన సభకు పోటీ చేస్తున్నట్లు తెలుస్తుంది. శుక్రవారం తాడేపల్లిలో జగన్ మోహన్‌రెడ్డిని కలిసేందుకు జిల్లా నాయకులు వెళ్ళారు. ఇంతియాజ్ అహ్మద్‌కు కర్నూలు అసెంబ్లీ, బీవై రామయ్యకు కర్నూలు ఎంపీ సీటు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. తనకు కాని తన సతీమణి కేడీసీసీ బ్యాంక్ చైర్మెన్ ఎస్వీ విజయమనోహరికి సీటు కేటాయించాలని ఎస్వీమోహన్‌రెడ్డి అదిష్టానంను కోరినట్లు తెలుస్తుంది.

చక్కటి చేతి రాతతో విద్యార్థుల బంగారు భవిష్యత్తు

విశాలాంధ్ర - ఆదోని : మంచి చేతిరాతతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద్ అన్నారు. గురువారం అరసం ఆధ్వర్యంలో విద్యార్థులలో మంచి చేతి వ్రాతను పెంపొందించడం కోసం "సుందర దస్తూరి 'పోటీలను మరియు పద్య రచన పోటీలను నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ లో నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో 70 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మందికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలీమ్ సిద్ధిఖి చేతులు మీదుగా బహుమతులను అందించడం జరిగిందన్నారు. ప్రథమ ద్వితీయ స్థానాలలో వైష్ణవి , మహేశ్వరి,ఉదయ్ కుమార్ ,వంశిత ,అర్చన షేక్షావలి, ఈశ్వరి ,హిమబిందులు ప్రతిభ కనబరచగా మరో 19 మంది విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులను అందుకున్నారు.

ఆలూరు సీటు సుజాతమ్మకు ఇవ్వాల్సిందే

విశాలాంధ్ర-ఆలూరు: ఆలూరు టీడీపీ సీటు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకే ఇవ్వాలని టీడీపీ నాయకుడు, మొలగవల్లి ఉప సర్పంచ్ రంగన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతూ, కార్యకర్తలకు అండగా ఉంటున్న అమెను కాదని వేరొకరికి ఇస్తే పార్టీకీ రాజీనామా చేస్తామని ప్రకటించారు. ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ నాయకులను ఉత్తేజ పరుస్తూ అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నదని చెప్పారు. అలాంటి ఆమెకే ఆలూరు తెదేపా సీటు ఇవ్వాలన్నారు. ఆయన తో పాటు వార్డు సభ్యులు ఐకాంత్, జలందర్, హుసేని తదితరులు పాల్గొన్నారు.

అపద సమయంలో 104, 108 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించండి. విలువైన ప్రాణాలు కాపాండి

కంబదహాల్‌లో భారీ అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఇందులో ఏడు గడ్డివాములు, నాలుగు గుడిసెలు అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో రూ. 4 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామ శివారుల్లో గ్రామ సర్పంచ్ దస్తగిరి మూడు ఎకరాలు, పింజరి ఉచ్చప్ప ఆరు ఎకరాలు, పింజరి ఉసేని రెండు ఎకరాలు, దేవనకొండ గూరన్న రెండు ఎకరాలు, దేవనకొండ నారాయణ ఐదు ఎకరాలు, బోడి తిమ్మప్ప ఒక ఎకరం, కలుగొట్ల పక్కిరప్ప ఒక ఎకరం , కులుమాల తిమ్మప్ప మూడు ఎకరాల గడ్డివాములకు సాయంత్రం నిప్పంటుకొని అగ్నిప్రమాదం జరిగింది. చుట్టుప్రక్కల వారు అప్రమత్తం అయ్యేలోగా మంటలు పెద్దవై గడ్డివాములు కాలి బూడిద అయ్యాయి. అలాగే గడ్డివాముల వద్ద వేసుకొన్న నాలుగు కొట్టాలు సైతం మంటల్లో దగ్ధమయ్యాయి. సమాచారం అందుకొన్న ఎమ్మిగనూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కళ్ల ముందే పశువుల కోసం ఏర్పాటు చేసుకొన్న గడ్డివాములు మంటల్లో కాలిపోతుంటే బాధిత రైతులు కన్నీరు పెట్టుకొన్నారు. బాధిత రైతు, గ్రామ సర్పంచ్ దస్తగిరి మాట్లాడుతూ గడ్డివాముల సమీపంలో ఎటువంటి విద్యుత్ తీగెలు కూడా లేవని, అగ్నిప్రమాదం ఎలా జరిగిందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరినైన బీడీ కాలుస్తూ తుంటను ఏమైనా పడేవేసి ఉంటే ప్రమాదానికి కారణమై ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు పెట్టి పశువుల గడ్డి కొనుగోలు చేసి వాములు వేసుకొన్నామని, గడ్డివాములు అగ్నిప్రమాదంలో కాలిపోవడంపై బాధను వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన పరిహారం అందజేసి, తిరిగి పశువులకు గడ్డి కొనుక్కునేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో గడ్డివాములు దగ్ధం- భారీగా ఆస్తి నష్టం

విశాలాంధ్ర-హెాలగుంద: మండలంలోని నేరనికిలో ఊరి బయట వేసిన ఏడు గడ్డివాములు విద్యుదాఘాతంతో పూర్తిగ కాలి బూడిద అయ్యాయని బాధితులు రోగించారు గడ్డివాములపై విద్యుత్తు తీగలు వెళ్లాయని విద్యుత్ తీగలు చెట్లు తాకడంతో విద్యుత్ షార్క్ సర్క్యూట్ వల్ల అగ్ని రవ్వలు గడ్డివాములపై పడడంతో గురువారం గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి రైతులు హెచ్ మునిస్వామి, హెచ్ పేటగిరప్ప, హెచ్ చంద్రప్ప, హెచ్ శేఖప్ప, హెచ్ వీరేష్, హెచ్ షేకప్ప లు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి కర్ణాటక రాష్ట్రంలో వరి గ్రాసం, వేరుశనగ పొట్టు, జొన్న, సజ్జ సొప్పొ లను కూలీల ద్వారా ట్రాక్టర్ తో తీసుకువచ్చి వేశారు ఎంతో శ్రమపడి కష్టపడి పశుగ్రాసాన్ని సేకరించి పశువుల కోసం వేస్తే విద్యుత్ ఘాతం తో గడ్డివాములు పూర్తిగా కాలిపోవడంతో పశుగ్రాసులకు మేత కరువైందని అలాగే లక్షలాది రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు బోరున విలిపించారు డబ్బు పెట్టి పశుగ్రాసం కొనాలన్న దొరకదని ఇప్పుడు ఎలా తీసుకురావాలని వాపోయారు ఆలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక అధికారులు అగ్నిమాపక యంత్రం ద్వారా గడ్డివాముల మంటలను ఆపివేశారు గడ్డివాముల జరిగిన ఆస్తి నష్టం నివేదికను తయారుచేసి తాసిల్దార్, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తానని వీఆర్వో దామోదర్ తెలిపారు గడ్డివాములు ఆర్పడానికి ప్రజలు ఉడుత సహాయం చేసిన ఫలితం లేకుండా పోయింది గడ్డివాములు పూర్తిగా కాలిపోయి దద్ధమ్మయ్యాయని దీంతో రూ.7 లక్షల ఆస్తి నష్టం జరిగిందని వెంటనే బాధితులకు నష్టపరహారాన్ని జిల్లా కలెక్టర్ విడుదల చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, కానూరు, విజయవాడలో

F.A.No. 668 / 2023 in CC.No.47/2022

(కర్నూలు జిల్లా వినియోగదారుల ఫోరమ్ కర్నూలు వారి ఫైలు)

బిట్వీన్:

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, రిపై బై ఇట్స్ డివిజనల్ మేనేజర్, కర్నూలు వగైరా. ...అప్పీలెంట్స్

మరియు

షేక్ సుభాన్ బాషా (కంప్లైనెంట్) వగైరాలు ..రెస్పాండెంట్స్

టు,

ఆర్-1: షేక్ సుభాన్ బాషా, తండ్రి. షేక్ హుస్సేన్ మెహ, నివాస ఇంటి నెం. 3-59, బూడిదపాడు గ్రామం, గూడూరు(మం), కర్నూలు జిల్లా.

పైనెంబరు ఎఫ్.ఏ.లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు పైస్టేట్ కమీషన్/శ్రీకోర్టువారి ద్వారా, నోటీసు పంపినను మీకు ముట్టనందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పైకోర్టు/స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ ది.04-04-2024కి వాయిదావేసియున్నారు. సదరు వాయిదారోజు ఉ॥గం॥10-30ని॥లకు మీరు స్వయంగాగాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపు కోవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీంపరోక్షమందు విచారించి తీర్మానించబడును. (శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం) వాయిదా తేది.04-04-2024.

చేబ్రోలు యజ్ఞనారాయణ, అప్పీలెంట్స్ తరపు న్యాయవాది కాకుమానువారి వీధి, కొత్తపేట, గుంటూరు.సెల్: 9848255609

WANTED

Kurnool MRT & Transformers Contract Worker గా పని చేయుటకు Candidate కావలెను.

Q: S.S.C- 50%, ITI-60% (Electrician)

Age : 18 to 35 years. క్యాటగిరి: OC (W)

14 రోజుల్లో బయోడేటాను ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

The Circle Inspector. APTS.
office of the SE/operation APSPDCL
Kurnool-518003. A.P.

G.Baskar Reddy, CONTRACTOR
H.NO: 3-16-25, SBI Colony, మదనపల్లి-517325.
Cell: 97037 32540.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 01, మార్చి, 2024

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని కునుకుంట్ల గ్రామ సచివాలయ పరిధిలో 99.24 లక్షల తో నిర్మించిన అభివృద్ధి పనులను బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి గురువారం ప్రారంభించారు. 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, 24.8 లక్షలతో నిర్మించిన వైయస్సార్ హెల్త్ క్లినిక్, మన్నే నాయక్ తండాలో 22.6 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, ఐదు లక్షల తో నిర్మించిన సిసి రోడ్డు, మర్రికుంట తండాలో 17.9 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, విశ్వనాథ్ తండాలో 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జగన్మోహన్ రెడ్డి తన సాధ్యమని అన్నారు. నేడు గ్రామ గ్రామాన సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలను, వైయస్సార్ హెల్త్ క్లినిక్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాటసాని తిరుపాల్రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్ బాబు, ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ యమున, వైసిపి నాయకులు పురుషోత్తం నాయుడు, ఎంపీటీసీ పోలక ప్రత్యూష, సచివాలయ సిబ్బంది,వాలంటరీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - ఆదోని : వాహన దారులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించి - ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని సబ్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత మాసంలో జరిగిన రోడ్ సేఫ్టీ సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలలో బాగంగా ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో నెట్టకల్ క్రాస్ వద్ద రంబుల్ స్ట్రిప్స్, ఎమ్మిగనూరు పట్టణం నందవరం వై జంక్షన్ దగ్గర లైటింగ్, ఎమ్మిగనూరు కమిటీ మార్కెట్ సమీపంలో స్పీడ్ బ్రేకర్స్ వేయడం జరిగిందన్నారు. డివిజన్లో పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. ఆదోని ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో రంబల్స్ ట్రిప్స్ వారంలోపు పూర్తి చేయాలన్నారు. ఎమ్మిగనూరు నుండి ఎర్రకోట వరకు రోడ్డు మరమ్మత్తులను త్వరత గతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. ఆదోని నూతన బ్రిడ్జి సమీపంలో సర్వీస్ రోడ్డుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎమ్మిగనూరు ఆస్పరి రోడ్డుకు సంబంధించి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి వివరాల పై ఆరా తీశారు. వాహనదారులు భద్రత కోసం ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలి అన్నారు. ఓవర్ లోడ్ , ఓవర్ స్పీడ్ వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే చోట ఆ యొక్క ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్గా గుర్తించి అక్కడ నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు ఆ ప్రదేశంలో ఎటువంటి ఇన్ఫ్రాస్ట్రక్చర్ సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్ సేఫ్టీ సంబంధించిన నిబంధనలను వాహనదారులకు అవగాహన కల్పించి ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో డీఎస్పీ శివ నారాయణస్వామి ఆర్టీవో నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శిశిర దీప్తి, రోడ్లు భవనాలు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, నేషనల్ హైవే ఏ.ఈ శ్రీ హరి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ, , పోలీసు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-ఎడ్యుకేషన్ : కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం అవుతున్నాయని ఆర్ఐవో గురువయ్యశెట్టి గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ఒక నిమిషం ఆలస్యమైతే కూడా పరీక్షలకు అనుమతించబడదన్నారు. విద్యార్థులు ప్రతిఒక్కరూ సకాలంలో హాజరుకావాలని వారు పిలుపు నిచ్చారు. తప్పనిసరిగా హాల్టికెట్, తీసుకొని రావాలని వారు సూచించారు. ప్రతి సెంటర్లో హెల్ప్ లైన్ నెంబర్ కూడా ఏర్పాటు చేశామన్నారు.

తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర-బనగానపల్లె : తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలస్ దద్దరిల్లిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు, ప్రజలకు ఎంతో కీలకం అని వైఎస్సార్సీపీ దొంగలకు వ్యతిరేకంగా తెలుగుదేశం, జనసేన పోరాడుతున్నాయి, అని నిన్న తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ జనసేన సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది. టీడీపీ జనసేన చేతులు కలిపింది. మా వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అధికారం కోసం కాదు 5 కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమన్నారు.ప్రజల ప్రయోజనాల కోసం సూపర్ 6ని ప్రవేశపెట్టాం, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూప్రింట్ టీడీపీ దగ్గర ఉంది, ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథకాలు అమలు చేయడం సాగునీరు అందించి రైతులను ఆదుకుంటాం, యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం,పాలన ద్వారా సంపాదించిన సొమ్మును పేదలకుఅందజేస్తాంటీడీపీ-జనసేన పొత్తు సూపర్ హిట్,టీడీపీ విన్నింగ్, వైసీపీ లూసింగ్, పులివెందుల జగన్ ఓటమితథ్యమని జోష్యం చెప్పారు.

పార్టీ మారితే దుకాణాలు ఖాళీ చేయిస్తారా



విశాలాంధ్ర-చాగలమర్రి : టిడిపి,తన నాయకత్వం పై నమ్మకంతో పార్టీ మారిన కార్యకర్తల ఉపాధి మార్గం కోల్పోయేలా వైసీపీ నాయకులు దుకాణాలు ఖాళీ చేయిస్తారా,ఖాళీ చేయించినంత మాత్రనా ఎవరు భయపడే పరిస్థితుల్లో లేరని నియోజకవర్గ టిడిపి నాయకులు భూమా జగత్విఖ్యాత్రెడ్డి తెలియజేసారు.గురువారం చాగలమర్రి పట్టణంలోని ముత్యాలపాడు బస్టాండు వద్ద నూతనంగా లాలు ఏర్పాటు చేసిన బైక్గ్యారేజ్ను ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల టిడిపిలో చేరిన లాలు అనే కార్యకర్త ఓ వైసీపీ నాయకుడి స్థలంలో బైక్ గ్యారేజ్ను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నాడు. అభిమానంతో టిడిపిలో చేరిన వెంటనే ఖాళీ చేయించడం వైసీపీ నాయకుల వికృతికి పరాకాష్ట అన్నారు.రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి అఖండ విజయం సాధించడం తథ్యమన్నారు. కార్యక్రమం లో టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాషా,టిఎస్టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు,జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు,టిడిపి నాయకులు కొలిమి హుసేన్వలి, షరీఫ్, మౌలాలి, హనీఫ్,జెట్టినాగరాజు,సుధాకర్,టైలర్ ఖాదర్, అజీం, రమేష్, చిన్న నరసింహారెడ్డి, రాజేష్, గాంధీ, కరిముల్లా,కేఆర్కే రవి, నాగూర్, గఫార్, ఖాజారసూల్, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

విశాలాంధ్ర-నంద్యాల రూరల్ : నంద్యాల మండలంలోని భీమవరం గ్రామంలోని ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేసినట్లు దాత గోరంట్ల హరినాథ్ తెలిపారు. గురువారం భీమవరంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు తల్లిదండ్రుల జ్ఞాపకార్థము 100 స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తల్లిదండ్రుల జ్ఞాపకార్థము ఏదో ఒక రూపంలో సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే పేద విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు, ఫీజులు రొటీరీ క్లబ్ ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. పంపిణీ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు దండే దస్తగిరి, ట్రెజరీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జొన్న రైతులు కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : రాష్ట్ర వ్యాప్తంగా జొన్న సాగు చేసిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ఇరగం రెడ్డి తిరుపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గోవింద పల్లె గ్రామం లో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి స్థానిక వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ అధ్యక్షతన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వము జొన్న రైతులకు గిట్టు బాటు గల మద్దతుధరను కల్పించిందన్నారు. పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేసే రైతులకు మధ్యదలారుల ప్రమేయం లేకుండా ప్రైవేట్ మార్కెట్ కన్న అధిక ధర వెచ్చించి జొన్నలను కొనుగోలు చేస్తున్నదని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ రామ్మోహన్రెడ్డి టెక్నికల్ ఏవో నాగేంద్ర ప్రసాద్ వ్యవసాయ సిబ్బంది గోవిందపల్లె గ్రామ రైతులు పాల్గొన్నారు.

రంజాన్, శివరాత్రిని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో వీధిలైట్లు వెలిగేలా చూడాలి

విశాలాంధ్ర - ఆదోని : రంజాన్ శివరాత్రి పండుగను దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని అన్ని వార్డుల్లో వీధిలైట్లు వెలిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కౌన్సిలర్లు ఉస్మాన్ భాష, రఘునాథరెడ్డిలు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో మున్సిపల్ చైర్ పర్సన్ శాంత అధ్యక్షతన 24 అంశాలతో కూడిన అజెండా 6 అంశాలతో కూడిన టేబుల్ సమావేశం జరిగింది. పట్టణంలోని వెంకన్న బాబు వద్ద గత వారం రోజుల క్రితం చిన్నారిని కుక్కలు వెంబడించి గాయపరిచిన జరిగిన సంఘటన పై అధికారులు స్పందించకపోవడం ఏమిటని కనీసం చర్యలు కూడా తీసుకుపోవడం సిగ్గుచేటని 25 వ వార్డు కౌన్సిలర్ సయ్యదాష్మీ ప్రశ్నించారు. వెంకన్న బావిలో విద్యార్థులు ఈతకు వెళుతున్నారని ప్రమాదాలు జరగక మునిపే అక్కడ వాచ్మెన్ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ సయ్యదాష్మీ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. వార్డులో వీధిలైట్లు వెలగడం లేదని, వార్డుల నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకు వస్తున్నప్పటికీ పట్టించుకోవడం ఏమిటని ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ ఉస్మాన్ భాష ప్రశ్నించారు. రంజాన్ శివరాత్రి పండుగలు దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కౌన్సిలర్ ఉస్మాన్ భాష అధికారులు కోరారు. గత కౌన్సిల్లో కూడా పట్టణంలో కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యను పట్టించుకోకపోవడం దారుణమని ఐదవ వార్డు కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. కౌన్సిల్ లో జరుగుతున్న అంశాలపై పురోగతి లేదని అజెండా కౌన్సిల్ కే పరిమితం కాకుండా అధికారులు చొరవ చూపాలని కౌన్సిలర్లు వాపోయారు. పట్టణంలో 25 చెత్త సేకరణ ఆటోలు ఉండగా అందులో తొమ్మిది ఆటోలు మైనర్ రిపేర్లతో నిలిచిపోవడంతో పట్టణంలో చెత్త సేకరణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. చెత్త సేకరణ ఆటోలు రాకపోవడంతో ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని కౌన్సిలర్లు అన్నారు. ఆదోని మున్సిపల్ ఇన్చార్జ్ ఇంజనీర్గా బాధ్యతలు చేపట్టిన చలపతి మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలపై అవగాహన ఉందని, బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో రా వాటర్ స్టోరేజ్ చేస్తున్నామని 70 శాతం వరకు బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ లో నీటిని నిల్వ ఉంచుతామని, పట్టణంలో నెలకొన్న సమస్యలపై తరగతి గతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని కౌన్సిల్ సభ్యులకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డి ఈ నాగభూషణం రెడ్డి, ఏఈలు రాజశేఖర్ రెడ్డి, కృపాకర్, మేనేజర్ అస్లాం భాష, అకౌంట్ ఆఫీసర్ సాయి లక్ష్మి, ఏఎస్ఓ రంజిత్ ,సానిటరీ ఇన్స్పెక్టర్ హరినాథ్, ఈ-1చంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వజ్ర రత్న మిత్ర అవార్డ్స్ పథకాలు అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర- కల్లూరు: కల్లూరు మండలం వాలంటీర్లకు వందనం వాలంటీర్స్ అప్రిసియేషన్ కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కల్లూరు నందు గురువారం జరిగినది. వజ్ర రత్న మిత్ర అవార్డ్స్ పథకాలు సర్టిఫికెట్ లు మరియు శాలువాలతో సన్మానించడమైనది. గౌరవ శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు , ఎంపీపీ శారద, పంచాయతీ రాజ్ శాఖ తెలంగాణ సలహాదారులు, పీఏసీఎస్ అధ్యక్షులు రమణారెడ్డి శంకర్ రెడ్డి, ఎంపీడీవో, ఉపాధ్యక్షులు చంద్రశేఖరెడ్డి కేశవారెడ్డి మునిస్వామి ఎంపీటీసీ, ఉలిందకొండ రమణారెడ్డి మధుసూధన్ రెడ్డి, మద్దిలేటి సర్పంచు పూసులు రామకృష్ణ రెడ్డి, సత్యం రెడ్డి, మస్తాన్ నూరా ఎంపీటీసీ లు నేరవాడ సర్పంచు హనుమంత రెడ్డి పార్లమెంట్ సుంకన్న వేణుగోపాల్రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు అభి బోయ రవి ఈశ్వరయ్య,పీఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి రూ.15 లక్షల మంజూరు

విశాలాంధ్ర- వెల్దుర్తి : మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చిన్న మాదన్న అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ వైద్య శాలకు వెళ్లగా అక్కడ వైద్యులు లివర్ మార్పిడి చేయాలని తెలిపారు. ఆపరేషన్ సౌకర్యం కోసం హైదరాబాద్లోని కంటినెంటల్ హాస్పిటల్ కు తరలించగా వైద్యులు 20 లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు.గ్రామస్తులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా ఫోన్లో డాక్టర్లతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు.సీఎం సహాయ నిధి కింద 15 లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన ఎల్ఓసి పత్రాన్ని కర్నూల్ లో ఎమ్మెల్యే స్వగృహంలో కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జయ మద్దిలేటి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొలిచే వారి కొంగు బంగారం రేణుక ఎల్లమాంబ

విశాలాంధ్ర-కోసిగి : కొలిచే వారి కొంగుబంగారం కోరిన కోర్కెలు తీర్చే దేవతగా విరజిల్లుతున్న కోసిగి రేణుక ఎల్లమాంబ రథోత్సవం గురువారం అశేష జనవాహిని మధ్య కన్నుల పండుగగా సాగింది. సాంప్రదాయ బద్ధంగా కోసిగి దొరల వంశస్తులైన మురళి దొర , శ్రీనివాసు దొర ఇంటి నుంచి సర్కార్ పూర్ణకుంభం మేళ తాళాలతో గ్రామ పూరవీధుల గుండా ఊరేగిస్తూ అమ్మవారి గుడి దగ్గరికి ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవం లాగారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని రేణుక ఎల్లమాంబకు ఆలయ అర్చకులు ఉమేష్ గౌడ్ , మహేష్ గౌడ్ ఆద్వర్యంలో ఎల్లమాంబకు తెల్లవారు జాము నుంచి కుంకుమార్చన,ఫల పుష్ప అలంకరణ మాహా మంగళహారతులు వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మను దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ ,కర్ణాటక ,మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. కుడుము గుగ్గిళ్ళు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో గత మూడు రోజుల నుండి గ్రామ సర్పంచ్ కుమారి. అయ్యమ్మ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. సాయంత్రం వేలాదిమంది భక్తుల నడుమ ఉదో ఉదో తాయి ఎల్లమ్మ అంటూ నామస్మరణంతో ఆలయం నుండి పాదాల వరకు రథోత్సవం లాగి తిరిగి యధాస్థితికి చేర్చారు. వైసిపి,టిడిపి నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోసిగి సీఐ ప్రసాద్ , ఎస్ఐ సతీష్ కుమార్ ల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

ప్రజా దాహాన్ని తీర్చాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎమ్మిగనూరు పట్టణంలో పాడైపోయిన తాగునీరు బోరు పంపులను తక్షణమే మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నాయకులు వంపన గౌడు, జి.రంగన్న భాస్కర్ యాదవ్, తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమై బానుడు భగభగమంటూ ప్రజలు దాహం దాహం అంటున్నారని కాబట్టి పట్టణ ప్రజలకు త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పట్టణంలో త్రాగనీరు సమస్యను అధికమించాలంటే పాడైపోయిన తాగునీరు బోరు పంపులను మరమ్మత్తులు చేయించాలని వారు కోరారు.గత ప్రభుత్వం హయాంలో పట్టణ ప్రజల దాహాన్ని తీర్చడానికి మున్సిపల్ నిధులు ద్వారా 1 కోటి 20 లక్షలతో 125 తాగునీటి ట్యాంకులు ఏర్పాటుచేసి దాని ద్వారా ప్రజల తాగునీటి దాహాన్ని తీర్చడం జరిగిందని, ప్రస్తుతం మున్సిపల్ అధికారులు వాటిని ఉపయోగించకుండా కేవలం 20 ట్యాంకులను మాత్రమే ఉపయోగంలో ఉంచారని, ప్రధానంగా శివారి కాలనీలు అయిన లక్ష్మీపేట,సంజీవయ్య నగర్,ఎల్లమ్మ బీడు,మైనారిటీ కాలనీ, క్రాంతి నగర్,ఎస్సీ కాలనీ,ఎన్టీఆర్ కాలనీ తదితర కాలనీ ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,పట్టణ ప్రజల దాహాన్ని తీర్చడానికి తక్షణమే బోర్లను మరమ్మతులు చేయించి 125 నీటి ట్యాంకులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని వారిచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమయుల్లా, పార్టీ ప్రజాసంఘాల నాయకులు బజారి,మల్లికార్జున గౌడ్,దాదావలి,కాజా, వీరేష్,తిమ్మ గురుడు, నరసింహులు,వీరేష్, మహమ్మద్ అలీ, తదితరులు పాల్గొన్నారు

4న జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జగన్నాథగట్టు పై నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి మార్చి 4వ తేదిన శంకుస్థాపనను చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు.జగన్నాథగట్టు పై జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి ఈనెల 4వ తేదిన ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, మున్సిపల్ కమీషనర్ భార్గవ తేజతో కలిసి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హెలిపాడ్, వేదిక స్థలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్నాథగట్టు పై నిర్మించనున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన చేయనున్నట్లు తాత్కాలికంగా నిర్ణయించినట్లు సమాచారం వచ్చిన నేపథ్యంలో హెలిప్యాడ్, వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని తెలిపారు.. ఈ సందర్భంగా పైలాన్, సభా వేదిక ప్రాంగణం, హెలిపాడ్ ఏర్పాటుపై జేసీ, ఎస్పీ చర్చించారు.. హెలిపాడ్ ఏర్పాటుకు పలు ప్రాంతాలను పరిశీలించారు.ఈకార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, డిఎస్పీ విజయ శేఖర్, ఆర్ అండ్ బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్ బాబు, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

విశాలాంధ్ర-పత్తికొండ: శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 75వ రథోత్సవ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవాన్ని అశేష భక్తజన సందోహం నడుమ ఊరేగించారు. ఈ వేడు కలకు స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవి, టీడీపీ ఇన్చార్జి కే.ఈ. శ్యాంబాబులు వేరువేరుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తాదులు తమ మొక్కులను తీర్చుకున్నారు. డి.ఎస్పీ. శ్రీనివాసరెడ్డి, అర్బన్ సీఐ మురళీ మోహనల నేతృత్వంలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీలో..

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీలో మరింత పురోగతి సాధించాలని అన్ని మండలాల ఎంపీడీవోలను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఇప్పటివరకు 1.56 లక్షల కార్డులు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన వెల్లడించారు.

హెచ్ఎం సేవలు మరువలేనివి

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయులుగా బోరెడ్డి కృష్ణారెడ్డి పాఠశాలలో విద్యార్థులకు బోధన చేయడంతో పాటు తన తండ్రి జ్ఞాపకార్థం పలు పాఠశాలలకు బహుమతులు ప్రధానం చేయడం ఈయన చేసిన సేవలు మరువలేనివని ఎంపీడీవో రఘురాం, ఎంఈఓ వీరప్రతాప్రెడ్డిలు ప్రశంసించారు. హెచ్ఎం పదవి విరమణ సందర్భంగా గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు స్వీకరించిన రోజే పదవి విరమణ కూడా ముందే తెలుస్తుంది. ఈ సమయంలో బాధ్యతగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందినప్పుడే వారు చేసిన సేవలకు గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం హెచ్ఎం దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మెమెంటోను అందజేసి, శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అలాగే విశ్రాంత ఎంఈఓలు చెన్నారెడ్డి, మహబూబ్ బాషా, రంగనాయకులు, ఇతర పాఠశాలల నుండి హాజరైన ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరయ్య, నరసింహులు, రామమోహన్ రెడ్డి, చిన్నవీరారెడ్డి, దక్షిణామూర్తి శ్రీనివాసులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, పలువురు పాల్గొని పదవీ విరమణ పొందిన హెచ్ఎంను శాలువ కప్పి, పూలమాలతో సన్మానించారు.ా

ఘనంగా ప్రారంభమైన టెక్కేస్వామి ఉరుసు మహోత్సవం

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని కునుకుంట్ల గ్రామ పొలిమేరలో వెలసిన శ్రీ హజరత్ అపాంశావలి (టెక్కే స్వామి) దర్గా ఉరుసు ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కునుకుంట్ల గ్రామానికి చెందిన గూడాల సోదరులు గూడాల ప్రతాపరెడ్డి, గూడాల మురళీధర్రెడ్డి ఆధ్వర్యంలో ఈఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. మండలంలోని కునుకుంట్ల గ్రామ సమీపంలో వెలసిన హజరత్ అపాంషావళి ఖాదరి బాబా (టెక్కేస్వామి) ఉరుసు ఉత్సవాలు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా నిర్వాహకులు గూడాల మురళీధర్ రెడ్డి,ప్రతాప్రెడ్డిలు పేర్కొన్నారు.ఉరుసును ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఉరుసును తిలకించేందుకు పొరుగు జిల్లాలైన కర్నూల్, నంద్యాల, కడప, అనంతపురం,చిత్తూరు జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.భక్తులకు గూడాల సోదరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు.అలాగే భక్తుల సౌకర్యార్థం బనగానపల్లె, కోవెలకుంట్ల,తాడిపత్రి డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

అనాధ ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత విద్య



విశాలాంధ్ర- వెలుగోడు : తల్లిదండ్రులు లేని అనాధ ఆర్య వైశ్య విద్యార్థుల కు పూర్తిగా ఉచిత విద్యను అందించడం జరుగుతుందని, వీలైతే ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని ఆర్యవైశ్య ప్రముఖులు పేర్కొన్నారు. వెలుగోడులోని వాసవిసత్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని ఆర్యవైశ్యుల ఉపాధి కోసం కుట్టుమిషన్లు, గ్రైండర్లు, చిన్నపాటి యంత్రాలను దరఖాస్తు చేసుకున్న వారందరికీ రాయితీపై ఇవ్వడం జరుగుతుందని మండల ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు వెంకట సత్యనారాయణ, లాలం నాగార్జున, మండల అధ్యక్షులు బచ్చు రాములు తెలిపారు. ఉపాధి కోసం యంత్రాలు కావాల్సినవారు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుల వారికి తమ దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారందరికీ వీలైనంత త్వరలో ఉపాధి యంత్రాలు అందించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా నియోజకవర్గం ఆర్యవైశ్యులకు రాజకీయ చైతన్యం తీసుకుని వచ్చి ఓటు శాతాన్ని పెంచుకుంటామన్నారు.అన్ని రాజకీయ పార్టీల రాజకీయ నాయకులు ఆర్యవైశ్యులకు తగినప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంజీవరావు ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు బొగ్గవరపు లక్ష్మీనారాయణ , కార్యదర్శి పరుచూరి కుమార్, తల్లం సుమంత్ , సభ్యులు పలుకూరి శ్రీనివాసులు. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాడిచర్ల హరి సర్వోత్తమరావు వర్ధంతి



విశాలాంధ్ర- కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోవెలకుంట్లలో గాడిచర్లహరి సర్వోత్తమరావు 64వ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంధాలయ అధికారి రాఘవరెడ్డి, సమాజ సేవకులు పల్లె నరసింహారెడ్డి మాట్లాడుతూ గాడిచర్ల హరి సర్వోత్తమరావు సెప్టెంబర్ 14-1883 న కర్నూల్ భాగీరథి బాయి, వెంకటరావు దంపతులకు జన్మించాడని గాడిచర్ల హరి సర్వోత్తమరావు కర్నూల్, గుత్తి, నంద్యాల ప్రాథమిక ఉన్నత విద్యను అభ్యసించాడని తెలిపారు. 1906 లో మద్రాసులో డిగ్రీ పూర్తిచేసి 1907 లో స్వాతంత్ర ఉద్యమంలో వెళ్లారని తెలిపారు.క్రూరమైన విదేశీపులి అనే పేరుతో రాసిన సంపాదకీయంపై ప్రభుత్వం కోపించి మూడేళ్ల జైలు శిక్ష విధించి బండిపోట్లు, గజదొంగలు ఉండే బందించి బ్రిటిష్ ప్రభుత్వం చిత్రహింసలు పెట్టేవారని తెలిపారు.1927లో కాంగ్రెస్ అభ్యర్థిగా నంద్యాల నియోజకవర్గం నుండి మద్రాసు కౌన్సిల్‌కు ఎన్నికయ్యారని దానితో పాటు విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా కూడా పనిచేసారన్నారు.తదనంతరం రాజకీయాలు తగ్గించుకుంటూ గ్రంధాలయోద్యమం వైపు దృష్టి సారించాడని 1934 నుండి ఆంధ్ర గ్రంధాలయం కు అధ్యక్షుడుగా కొనసాగారని గ్రంథాలయ కార్యకర్తలకు వయోజన విద్యా ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచించి వారికి శిక్షణ శిబిరాలు కూడా నిర్వహించాడని తెలిపారు. ఆ తర్వాత 1952లో జరిగిన అఖిలపక్ష సదస్సుకు ఆయన అధ్యక్షత వహించాడని రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేశారని తెలిపారు. 1960 ఫిబ్రవరి 29న ఆయన మరణించాడని స్మారకార్థం విజయవాడలో సర్వోత్తమ భవనం వెలిసిందని తెలిపారు.